సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 26 । జనవరి । 2024



వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శం

వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శమని వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. -IIలో



టీడీపీలో కార్యకర్తలకే గ్యారెంటీ లేదు

జిల్లా తెలుగుదేశం పార్టీలో అసమ్మతి సెగలు ఎగిసిపడుతున్నాయి. ఆ పార్టీ అధిష్టానం, నేతలపై కార్యకర్తలు మండిపడుతున్నారు. -IIలో

I

గరిష్టం/కనిష్టం 35.4/19.3

వాతావరణం

జిల్లాలో గురువారం 19.3 – 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ఆర్టీసీకి పండుగ

- 508 ప్రత్యేక బస్సులు నడిపిన అధికారులు
- రూ. 1.42 కోట్ల సంక్రాంతి ఆదాయం



ప్రయాణికులతో కళకళలాడుతున్న ఆర్టీసీ బస్టాండు (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా వైఎస్సార్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించింది. కడప రీజియన్ పరిధిలోని కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి 508 బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పండుగకు ముందు, తర్వాత సాధారణ చార్జీలతోనే బస్సులను తిప్పారు. ఈ ఏడాది పండుగకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు ఆసక్తి చూపడంతో ఈ ఆదాయం ఒనగూరింది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువైంది.

- సంక్రాంతి పండుగకు ముందు జనవరి 10వ తేదీ నుంచి 16 వరకు, అలాగే పండుగ తర్వాత 17వ తేదీ నుంచి 22 వరకు పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, నగరాలకు ప్రత్యేక బస్సులు నడిపారు. ఇవి విజయవాడ, హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విశాఖపట్టణం, నెల్లూరు, తిరుపతి, అనంతపురం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించాయి.

ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట

సంక్రాంతి పండుగకు ప్రైవేటు ట్రావెల్స్ వారు ప్రయాణికులను అడ్డంగా దోచుకోవడం సర్వసాధారణం. అయితే పండుగకు ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతో ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

కడప డిపో ముందంజ

సంక్రాంతి పండుగకు ఒనగూరిన ఆదాయంలో కడప డిపో ప్రథమ స్థానంలో ఉంది. ఈ డిపో నుంచి 166 ప్రత్యేక బస్సులను 1,14,218 కిలోమీటర్లు తిప్పగా రూ. 50,47,909 ఆదాయం వచ్చింది. ప్రొద్దుటూరు డిపో నుంచి 85 బస్సులను 5,57,498 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 20,86,116 ఆదాయం ఆర్జించి రెండో స్థానంలో నిలిచింది. పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు డిపోలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గతంలో పోలిస్తే ఈసారి రికార్డు స్థాయిలో సంస్థకు ఆదాయం ఒనగూరింది.

డిపోల వారీగా ఆదాయం

డిపో	నడిచిన బస్సులు	కిలోమీటర్లు	ఆదాయం(రూ.లలో)
కడప	166	114218	50,47,919
పులివెందుల	73	54023	19,85,077
బద్వేలు	62	46865	18,02,872
జమ్మలమడుగు	68	46738	17,76,974
మైదుకూరు	54	37002	15,21,688
ప్రొద్దుటూరు	85	557498	20,86,116

ప్రయాణికులు ఆదరించారు



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మంచి ఆదాయం లభించడం సంతోషదాయకం. పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు బాగా ఆదరించారు. రానున్న కాలంలో ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడతాం. ఇందుకు సహకరించిన అధికారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బందికి అభినందనలు.

– పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

న్యూస్‌రీల్

గవర్నర్ తేనీటి విందుకు ఆహ్వానం



ముద్దం రాముడు

కమలాపురం: కమలాపురం పట్టణానికి చెందిన జిల్లా బెస్ట్ మ్యూజిక్ టీచర్ అవార్డు గ్రహీత ముద్దం రాముడు 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నారు. శుక్రవారం విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగే తేనీటి విందుకు హాజరు కావాలని రాముడుకు గవర్నర్ డిప్యూటీ సెక్రటరీ ఆహ్వానం పంపారు. గురువారం కమలాపురంలో రాముడు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడంతో పాటు గవర్నర్‌ను కలిసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

ఎస్సైలకు పదోన్నతులు

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలో 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలకు పదోన్నతులు కల్పించారు. ఈ క్రమంలో వైఎస్ఆర్ జిల్లాలో 9 మందికి సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు– కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. ఎ.మధుమల్లేశ్వర్ రెడ్డి, ఎస్.రోషన్, ఎస్.కుళ్లాయప్ప, సి.గోపినాథ రెడ్డి, ఎం.రాజగోపాల్, హెచ్.కృష్ణంరాజు నాయక్, డి.హాజీవలి, ఆర్.మోహన్, కడప రైల్వేస్ కె.రారాజులు పదోన్నతి పొందారు. వీరికి త్వరలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

నూతన నియామకం



కె.రాముడు



నాయని పెద్దన్న

మైదుకూరు: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘంలో మైదుకూరుకు చెందిన ఇరువురికి స్థానం లభించింది. మైదుకూరుకు చెందిన రజక సంఘం నాయకుడు కె.రాముడు (గాలి మిషన్) బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. అదే విధంగా కృష్ణ (పూసల) బలిజ సంఘం నాయకునిగా ఉన్న నాయని పెద్దన్నను సంఘం జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఆ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.రెడ్డిబాబు గురువారం ఉత్తర్వులు అందజేశారు.

28న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు తదితరులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని రామచంద్రాపురంలో ఉన్న మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్లో ఈనెల 28వ తేదీ ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు.దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు విడుదల చేశారు. లక్ష రూపాయల ప్రైజ్ మనీ అందించే ఈ పోటీలకు ఇంకా ఎవరైనా రిజిస్టర్ చేసుకోవాలంటే 9346240540 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు గవర్నర్ సత్కారం





అనూరాధ, దీప్తి మాధురిలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

కడప సెవెన్‌రోడ్స్/మైదుకూరు: ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం–2024లో ఉత్తమ సేవలు అందించిన మైదుకూరు ఏఈఆర్‌ఓ (తహసీల్దార్) అనూరాధ, కడప నగరం 13వ డివిజన్‌లో వార్డు ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీగా పని చేస్తూ పోలింగ్ కేంద్రం 215 బీఎల్‌ఓగా విధులు నిర్వర్తించిన ఎం.దీప్తి మాధురిలు ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీల తొలగింపు, సవరణలు చేయడంలో వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ వీరిని ఘనంగా సత్కరించారు. ఏఈఆర్‌ఓ అనూరాధకు రూ. 15 వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్, మెమెంటో అందజేశారు. బీఎల్‌ఓ విధులు నిర్వర్తించిన దీప్తి మాధురికి రూ. 10 వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్, మెమెంటో అందజేసి అభినందించారు. ఉత్తమ సేవలు అందించిన వీరిని కలెక్టర్‌తో పాటు సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటే

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ప్రజలు వేసే ఓట్లను బట్టే దేశ భవిష్యత్తు నిర్ణయించబడుతుందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గురువారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కులం, మతం, డబ్బు వంటి ప్రలోభాలకు లోను కారాదని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కు పొంది ఓటును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో 16,16,509 మంది ఓటర్లు ఉన్నారని, వీరంతా రానున్న ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవాలని కోరారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ గత సంవత్సరం జూన్ 1వ తేది నుంచి స్పెషల్ సమ్మరి రివిజన్ ప్రారంభమైందన్నారు. గత జులై 21 నుంచి ఇంటింటి పరిశీలన పూర్తి చేశామన్నారు. అక్టోబరు 27న ముసాయిదా జాబితా ప్రకటించామని చెప్పారు. ఈనెల 22న జిల్లా ఓటర్ల తుది జాబితాను వెలువరించామని పేర్కొన్నారు. జిల్లా జనాభా 22,47,356 మంది ఉండగా, అందులో అర్హులను 99 శాతం ఓటర్లుగా నమోదు చేశామన్నారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన 22,488 మందిని ఓటర్లుగా నమోదు చేశామని వివరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యావంతులు ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కొత్తగా నమోదైన యువ ఓటర్లకు కలెక్టర్ ఓటరు గుర్తింపు కార్డును పంపిణీ చేశారు. సీనియర్ ఓటర్లు, బెస్ట్ బీఎల్‌ఓ సూపర్‌వైజర్లను సన్మానించారు.అంతకుముందు స్టేట్ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టరేట్ సభా భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఆర్డీఓ మధుసూదన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలి

చెన్నూరు: జిల్లాలో అన్నిరకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, రీసర్వే మూడోదశ, ఇనామ్ – అసైన్డ్ భూములు, పీ–ఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్, జల్ జీవన్ మిషన్, ఆరోగ్యం, వైద్యం – కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, కులగణన, ఎన్నికల సన్నద్ధత, తదితర అంశాలపై.. అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ విజయరామరాజు , జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. వీసీ అనంతరం సంబందిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను శాఖల వారీగా అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేత



తొండూరులో మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు

తొండూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళాభ్యున్నతికి పెద్ద పీట వేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన తొండూరులోని గంగాదేవిపల్లె క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు 2019 ఏప్రిల్ తేదీ నాటికి డ్వాక్రా గ్రూపులకు ఎంతైతే అప్పు ఉందో దానిని నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని హామీ ఇచ్చారని.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మన పిల్లల చదువులు ఏ విధంగా ఉన్నాయో ఆలోచించాలన్నారు. 2019 జనవరి నాటికి రాష్ట్రంలో 39లక్షల పింఛన్లు ఉండేవని..సరిగ్గా ఐదేళ్ల నాటికి జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత 67లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారన్నారు. ఇంటికి వచ్చి తలుపు తట్టి నెలకు రూ.3వేలు అవ్వాతాతలకు ఇస్తున్నారని గుర్తు చేశారు. పలు పథకాలు ప్రవేశపెట్టి మీకు ఆసరా కల్పిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రతి అక్కను, ప్రతి చెల్లెమ్మను పేరు పేరునా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఎన్నికలముందు రైతుల రుణాలు రూ.87వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని చెప్పిందని, అయితే చంద్రబాబు రైతులకు శఠగోపం పెట్టారన్నారు.10వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి.. రూ.77కోట్లు మాఫీ చేయకుండా చేతులెత్తేశారన్నారు. గత ప్రభుత్వం డ్వాక్రా రుణాలన్నీ పూర్తి స్థాయిలో మాఫీ చేస్తామని చెప్పి..చేయలేదన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోని గత ప్రభుత్వాన్ని చూశాం..హామీలను అమలు చేసిన జగనన్న ప్రభుత్వాన్ని మనం చూస్తున్నామని అన్నారు. ఒక అబద్ధాన్ని వంద సార్లు చెబితే నిజమవుతుందన్న సిద్ధాంతాన్ని నమ్ముకున్న నాయకుడు చంద్రబాబు అయితే.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తెలిసిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పి మీరందరికి తెలియజేస్తున్నా.. వీరిద్దరి మధ్య తేడాను గమనించాలని కోరారు. రాబోయే రోజుల్లో కుళ్లు, కుతంత్రాలతో కూడిన రాజకీయాలతో చంద్రబాబు మీ దగ్గరికి వస్తారు.. హామీలు ఇస్తారు..వారి కుళ్లు రాజకీయాలను తిప్పికొట్టాలని మీకందరికీ మనవి చేస్తున్నానని తెలిపారు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఇచ్చిన మాటకు కట్టుబడి 95శాతం హామీలు అమలు చేసిన నాయకుడు జగనన్న అన్నారు. ఇవన్నీ గమనించి రాబోయే సంగ్రామంలో తప్పకుండా మీరందరి ఆశీస్సులు మన ప్రియతమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డికి అందించాలని కోరుతున్నానని పేర్కొన్నారు. శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహాయ సహకారాలతో తొండూరు మండలం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి 397గ్రూపులకు సంబంధించి 3975మంది డ్వాక్రా మహిళలకు రూ.3,52,33,641ల వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును పంపిణీ చేశారు.

- మండల కేంద్రమైన తొండూరులో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, బంగారు మునెయ్య, భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. మల్లేల గ్రామంలోనూ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి, సర్పంచ్ రజియా, మాజీ ఎంపీపీ జయప్రదలతో కలిసి ప్రారంభించారు. అనంతరం తొండూరు వైఎస్సార్ ఆసరా సంబరాలకు వచ్చిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల కోరికలు ప్రభుత్వం నెరవేర్చడంతో కేక్ కట్ చేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్స్ రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, రూప, ఎంపీపీ నారాయణమ్మ, జెడ్పీటీసీ బండి లక్ష్మీనారాయణమ్మ, మండల ఉపాధ్యక్షురాలు సావిత్రమ్మ, మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజనల్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

పులివెందుల రూరల్: పులివెందుల రింగ్ రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన రెవెన్యూ డివిజనల్ అధికారి క్యాంపు కార్యాలయాన్ని గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వేముల జెడ్పీటీసీ బయపురెడ్డి పాల్గొన్నారు.



◆ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



గణతంత్ర దినోత్సవ వేడుకలకు కడప పోలీసు పెరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాలకు కడపలోని పోలీసు పరేడ్ మైదానాన్ని సిద్ధం చేశారు. ఇందులో భాగంగా అక్కడ జరుగుతున్న పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం 9.05 గంటలకు పోలీసు గౌరవ వందనం స్వీకరించి పోలీసుల కవాతు పరిశీలిస్తారు. 9.25 గంటలకు సందేశం ఇస్తారు. 9.55 గంటలకు శకటాల ప్రదర్శన, 10.15 గంటలకు స్వాతంత్య్ర సమరయోధులకు సత్కారం, 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11.05 గంటలకు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేత, బహుమతుల ప్రధానం ఉంటుంది. 11.40గంటలకు అతిథుల స్టాల్స్ ప్రదర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, 11.55 గంటలకు జాతీయ గీతాలాపనతో ముగింపు కార్యక్రమం ఉంటుంది. –కడప కోటిరెడ్డిసర్కిల్

లోకపావని.. పాహిమాం

– ఘనంగా ఈశ్వరీదేవి పీఠం పర్యటన


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఈశ్వరీదేవి పీఠాధిపతి వీరకుమారస్వామి

రాజంపేట టౌన్ : రాయలసీమలో తొలిసారిగా రాజంపేటలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ఈశ్వరీదేవి ఆస్థాన పీఠం ధారిమ్మిక పర్యటన కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాచగుండ్ల లక్ష్మీప్రసన్నాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ ఈశ్వరీ మహాదేవి మఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు విశేషంగా పూజా కార్యక్రమాలను చేపట్టారు. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం నాదనీరాజనము, మహాగణపతి పూజ, కలశస్థాపన, అభిషేకం, హోమం కార్యక్రమాలను జరిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం కిక్కిరిసింది. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేట చెక్ పోస్టు వద్ద రూ. 70 లక్షలు పట్టివేత

సిద్దవటం : మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ. 70లక్షల నగదును పట్టుకున్నామని ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు. తాడిపత్రికి చెందిన వెంకటనారాయణరెడ్డి తిరుపతిలో ఉన్న తన స్థలాన్ని అమ్మితే వచ్చిన రూ. 70 లక్షల నగదును తన కారులో తీసుకొని తాడిపత్రికి వెళుతున్నారన్నారు. కారును భాకరాపేట చెక్ పోస్టు వద్ద తనిఖీ చేయగా అందులో రూ. 70 లక్షలు నగదు లభించింది. అందుకు సంబంధించి ఎలాంటి అధారాలను చూపక పోవడంతో నగదును సీజ్ చేసి ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శం

- పులివెందులలో ఘనంగా వైఎస్ జయమ్మ వర్ధంతి
- నివాళులర్పించిన వైఎస్ విజయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు


దివంగత వైఎస్ జయమ్మ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ విజయమ్మ, వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, కుటుంబ సభ్యులు, తదితరులు

పులివెందుల : దివంగత వైఎస్సార్ మాతృమూర్తి వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శమని దివంగత మహానేత వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్ రాజారెడ్డి సతీమణి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాతృమూర్తి వైఎస్ జయమ్మ 18వ వర్ధంతిని పులివెందులలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి ఘాట్‌ల వద్ద వైఎస్ విజయమ్మ, వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, వైఎస్సార్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఉన్న దివంగత వైఎస్ జార్జిరెడ్డి, దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి, దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఘాట్‌లతోపాటు ఇతర కుటుంబ సభ్యుల సమాధుల వద్ద పూలమాలలు వేసి వైఎస్ విజయమ్మ ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు పాస్టర్లు నరేష్ కుమార్, మృత్యుంజయుల ఆధ్వర్యంలో వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీరు వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ జయమ్మ పార్కుకు చేరుకుని అక్కడున్న వైఎస్ జయమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ విజయమ్మ మాట్లాడుతూ వైఎస్ జయమ్మకు తమ కుటుంబంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. పులివెందుల ప్రాంతంలో ఎవరికి కష్టమొచ్చినా తన బిడ్డలకు కష్టం వచ్చినట్లుగా భావించేవారన్నారు. వైఎస్సార్‌ను మాట తప్పని.. మడమ తిప్పని నేత గానూ, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టడం వెనుక వైఎస్ జయమ్మ పాత్ర ఎంతో ఉందన్నారు. ఆమె జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తర్వాత భాకరాపురంలోని జీసెస్ చారిటీస్‌లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానందరెడ్డి బామర్ది శివప్రకాష్‌రెడ్డి, సీఎం కార్యాలయ కోఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, వేంపల్లె మాజీ జెడ్పీటీసీ డాక్టర్ బాషా, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మడుగులో పడి వ్యక్తి మృతి

వీరపునాయునిపల్లె : మండలంలోని తాటిమాకులపల్లె గ్రామానికి చెందిన కుంట్లపల్లె గురివిరెడ్డి(52) ప్రమదవశాత్తు గురువారం మధ్యాహ్నం సంగమేశ్వర దేవస్థానం వద్దగల మడుగులో పడి మృతి చెందాడు. వివరాలిలా.. రోజులాగే ఉదయం కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో మడుగువద్దకు కాలకృత్యాలు తీర్చుకొనేందుకు వెళ్లాడు. చాలా సేపటి వరకు రాక పోవడంతో తోటి కూలీలకు అనుమానం వచ్చి మడుగు వద్దకు వెళ్లారు. అక్కడి నీటి మడుగులో పడి ఇరుక్కుపోయి ఉన్నాడు. వెంటనే బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు తోటి కూలీలు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరికి పెళ్లి కాగా మరొకరికి పెళ్లి కావాల్సి ఉంది.

టీడీపీలో కార్యకర్తలకే గ్యారెంటీ లేదు


కడప నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

- పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి వ్యాపారవేత్త
- కొల్లగొట్టిన నీరు–చెట్టు నిధులను ఏమి చేశారు
- కార్యకర్తలతో సంబంధం లేకుండా మాధవిరెడ్డికి బాధ్యతలు ఎలా అప్పగిస్తారు
- మంచి అభ్యర్థికి అసెంబ్లీ టిక్కెట్ కేటాయిస్తే బలపరుస్తాం
- టీడీపీ క్లస్టర్ల సమావేశంలో కార్యకర్తల తిరుగు బావుటా

కడప రూరల్ : జిల్లా తెలుగుదేశం పార్టీలో అసమ్మతి సెగలు ఎగిసిపడుతున్నాయి. ఆ పార్టీ అధిష్టానం, నేతలపై కార్యకర్తలు మండిపడుతున్నారు. ఇక కడప టీడీపీలో అయితే అసమ్మతి అగ్నిగుండంలా మారింది. గురువారం స్థానిక రహమతియా ఫంక్షన్ హాల్‌లో టీడీపీ కడప మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబు, సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ క్లస్టర్లు, యూనిట్ ఇన్‌చార్జిల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ కార్యకర్తలు పలువురు పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, కడప ఇన్‌చార్జి మాధవిరెడ్డిల వ్యవహార శైలిపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు రామలక్షుమ్మ, స్వర్ణలత మాట్లాడుతూ ఏళ్ల తరబడి టీడీపీలో సీనియర్ కార్యకర్తలుగా పనిచేస్తున్నాం. పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి అయితే ఏ నాడూ మమ్మల్ని కనీసం పలకరించను కూడా లేదని విమర్శించారు. ఆయన ఓ వ్యాపారి, పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా వ్యాపారమే చేసుకుంటాడని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు శ్రీనివాసులురెడ్డి నీరు–చెట్టు నిధులను కొల్లగొట్టారు. ఆ డబ్బులో చిల్లిగవ్వ కూడా తమలాంటి కార్యకర్తలకు ఇవ్వలేదన్నారు. గత ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లో అభ్యర్థులను గెలిపిస్తామని ప్రగల్భాలు పలికి దారుణంగా విఫలమయ్యారని గుర్తు చేశారు. కడప కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అతికష్టం మీద ఒక్క కార్పొరేటర్ స్థానం మాత్రమే గెలిచిందన్నారు. ఇప్పుడు తన సతీమణి మాధవిరెడ్డిని తెరపైకి తెచ్చి, కడప ఇన్‌చార్జిగా నియమించుకోగలిగారని అన్నారు. ఆమెకు పార్టీ గురించి, కార్యకర్తల గురించి ఏమి తెలుసని ప్రశ్నించారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఆమెకు కడప ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కడప ఎమ్మెల్యే టికెట్‌ను సీనియర్లకు కేటాయిస్తే తామంతా బలపరుస్తామని తెలిపారు. పార్టీలో కార్యకర్తలకే విలువ, గ్యారెంటీ లేదు ప్రజలకు ఏమి గ్యారెంటీ ఇస్తారని నిలదీశారు. అసమ్మతి అంశం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న డైరెక్టర్, అధ్యాపకులు

వేంపల్లె : స్థానిక ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై, ఓటరు విలువపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమన్నారు. ఎఫ్‌ఓ కోటేశ్వరి, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు విశ్వనాథరెడ్డి, ఇందుమతి, అనిల్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ డీన్ ఆఫ్ అకడమిక్ రాఘవరెడ్డి, జాతీయ సేవా సమితి సమన్వయకర్త మధుసూదన్ పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలను పాటించాలి


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న రవాణా శాఖ ఉప కమిషనర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వాహనదారులు ప్రజలు ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలని జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ ఈ.మీరా ప్రసాద్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ధర్మారావు పేర్కొన్నారు. గురువారం 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా నగరంలోని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రహదారి భద్రత నియమాలను పాటించకపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రతి వాహనదారుడు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల పత్రాలను సక్రమంగా ఉంచుకొని వాహనాన్ని నడపాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారుఊఐ. ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, ప్రసాద్, ఏఎంవీఐ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


నిఖిలేశ్వరరెడ్డి(ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కె.నిఖిలేశ్వరరెడ్డి(24) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను వ్యవసాయం చేసేవాడు. దాదాపు కొన్నేళ్ల నుంచి పంటలు సరిగా పండక పోవడం, చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతెలియక విషద్రావణం తాగాడు. వెంటనే పులివెందుల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం నంద్యాలకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

తండ్రిని చంపిన తనయుడు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె దళితవాడలో గురువారం మధ్యాహ్నం చాపాటి చిన్నవీరయ్య (65) అనే వ్యక్తిని అతని కుమారుడు శివ గొడ్డలితో నరికి చంపాడు. చిన్న వీరయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శివకు వివాహమైనప్పటికీ భార్య తనతో లేదనే కారణంతో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఇంటిలో నిద్రిస్తున్న తండ్రి చిన్న వీరయ్యను శివ గొడ్డలితో నరికి చంపాడు. తన అక్కకు ఫోన్ చేసి నాన్న చనిపోయాడు వచ్చి చూడండి అని చెప్పి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి సీఐ మస్తాన్, ఎస్‌ఐ కొండారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత మార్కెట్‌లో అగ్నిప్రమాదం


మంటల్లో కాలిపోతున్న దుకాణాలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పాత మార్కెట్‌లోని రాజబాటవీధిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం వేకువ జామున రంగుపొడి, ముగ్గు పిండి, గృహోపకరణాల విక్రయ దుకాణాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో దుకాణాల్లోని సామగ్రి పూర్తిగా కాలి బూడిదైంది. రూ. లక్షల సామగ్రి బూడిద పాలైందని యజమాని జమాల్‌వలి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 5 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు చేశారు. నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకులు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అక్రమ మద్యం స్వాధీనం


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న కడప చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి


వేంపల్లె : అక్రమ మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ, ఎస్‌ఐలు

కడప అర్బన్ : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచింది. కడప చిన్నచౌక్ పరిధిలో సీఐ నరసింహారెడ్డి, ఎస్‌ఐలు పి. రవికుమార్, మహమ్మద్ రఫీలు తమ సిబ్బందితో కలిసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన ఎర్రబల సుధీర్ (40) గత కొంతకాలంగా చింతకొమ్మదిన్నె మండలం, మామిళ్లపల్లె పంచాయతీ, ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతను అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సుధీర్‌ను అరెస్టు చేసి 347 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని సీఐ వెల్లడించారు. నిందితుడి అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సిబ్బందికి రివార్డుకు సిఫార్సు చేశారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామానికి చెందిన గజ్జల శ్రీనివాసులు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.తులసినాగప్రసాద్ గురువారం తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేశామన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండల పరిధిలోని రెండు గ్రామాలలో గురువారం 70 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట రమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి వల్లూరులో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 20 మద్యం బాటిళ్లు, సీతోరుపల్లెలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామంలో 50 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. రాముడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు తిరుపాల్ నాయక్, ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని భార్య గొంతు కోశాడు !

నిమ్మనపల్లె : వ్యసనాలకు బానిసైన భర్త తాను మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెపై పైశాచికంగా దాడిచేసి బ్లేడుతో గొంతుకోసిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. వెంగంవారిపల్లె పంచాయతీ చిన్నల్లవారిపల్లెకు చెందిన ఉమామహేశ్వరరెడ్డి వ్యసనాలకు బానిసై మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో.. భార్య అమృత(33) తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే పెద్దమనుషులతో పంచాయితీ చేసి నెలరోజుల క్రితం భార్యాపిల్లలను ఇంటికి తెచ్చుకున్నాడు. అయినా ఉమామహేశ్వరరెడ్డిలో మార్పు రాకపోగా, కుటుంబానికి ఆసరాగా ఉన్న అర ఎకరం పొలం, ఓ పాడి ఆవును అమ్మేశాడు. భర్త ఆగడాలను భరిస్తూ.. అమృత కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఉమామహేశ్వరరెడ్డి భార్య అమృతతో మద్యానికి డబ్బు ఇవ్వాలంటూ గొడవపడ్డాడు. ఆమె పట్టించుకోకుండా తమ పాడిఆవు వద్ద పాలు పితుకుతుండగా, ఒక్కసారిగా ఆమెపై బ్లేడుతో దాడిచేశాడు. గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ప్రాణాపాయం తప్పింది. పోలీసులు కేసు నమోదు చేశారు.



ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము. – ఏనుగు వెంగమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

అమ్మఒడితో ఆసరా



మేము బద్వేలు పట్టణంలోని 7వ వార్డులో గల బెస్తవీధిలో నివసిస్తున్నాము. నా భర్త ఆటో నడుపుతారు. మా కుమారుడు తేజ రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. గతంలో పిల్లవాడి చదువుకు సంబంధించిన పుస్తకాలు, బ్యాగు తదితరాలకు వేలల్లో డబ్బు ఖర్చయ్యేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా జగనన్న వచ్చాక ప్రతి ఏటా అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేలు సాయం మాకెంతో ఆసరాగా నిలుస్తోంది. అలాగే గతంలో కంటే బడి రూపురేఖలు కూడా బాగుపడ్డాయి. నా భర్తకు వాహనమిత్ర ద్వారా ప్రతి ఏటా రూ.10 వేలు అందుతోంది. జగనన్నకు ధన్యవాదాలు. – బి.రమాదేవి, బెస్తవీధి, బద్వేలు

నెరవేరిన సొంతింటి కల



దాదాపు ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో బతుకుతున్నాం. కూలి పనులకు వెళితే జీవనోపాధి గడవడం కష్టంగా ఉంది. కనీసం సొంతిల్లు ఉంటే అద్దె డబ్బులన్నా మిగులుతాయని కలలు కనేవాళ్లం. గత ప్రభుత్వంలో మా గోడు పట్టించుకునేవారే లేరు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి ఇంటి పట్టా ఇవ్వడమేకాక బిల్లు కూడా మంజూరై సొంతింటి కల నెరవేర్చుకున్నాం. – గౌసియా, గురిజాల, సింహాద్రిపురం

28 నుంచి రాజంపేటలో క్రీడా పండుగ

రాజంపేట టౌన్ : ఈనెల 28వ తేదీ నుంచి రాజంపేట పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్–14 67వ జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో గురువారం స్కూల్ గేమ్స్ రాష్ట్ర సెక్రెటరి జి.భానుమూర్తిరాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఈఓ మాట్లాడారు. దేశవ్యాప్తంగా 27 జట్లు, 327 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే, యాభైమంది కోచ్‌లు, మేనేజర్లు కూడా వస్తారన్నారు. క్రీడాకారులకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్, గర్ల్స్ హైస్కూల్, ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. మేనేజర్లు, కోచ్‌లకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, కల్యాణ మండపాల్లో, పలు లాడ్జీలలో వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ రాత్రి నుంచే వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు రాజంపేటకు రానున్నట్లు తెలిపారు. పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలకు మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. స్కూల్‌గేమ్స్ రాష్ట్ర సెక్రెటరి జి.భానుమూర్తిరాజు మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు రానుండటంతో రాజంపేట, కడప, రేణిగుంట రైల్వేస్టేషన్లలో రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. క్రీడాపోటీలు జరిగినన్ని రోజులు క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు, 26 కమిటీలను వేసినట్లు తెలిపారు.